# సంతె ఖ్లు

**ఊరికి దూరంగా, విసిరి వేయబడ్డ అనాథ ప్రేతాల్లా, ఆ మూల ఆర్టీసీ బస్సు డిపో, ఈ మూల హెడ్‌క్వార్టర్సు హాస్పిటల్ ఉన్నాయి.**

బలిసిన దున్నపోతులా ఉన్న బస్సులోనుంచి దిగాడు నర్సింహులు. వాళ్ళనీ వీళ్ళనీ, హాస్పిటల్‌కు దోవ అడుక్కుంటూ, కాళ్ళీడ్చుకుంటూ, ఖంగ్ ఖంగ్‌మని దగ్గుకుంటూ ఆయాసంతో రొప్పుకుంటూ హాస్పిటల్ దగ్గర కొచ్చేసరికి నరసింహులు ప్రాణం కడగట్టిపోయింది.

అందమైన పెద్ద హాస్పిటల్ భవనాల్ని చూడగానే సగం రోగం కుదిరి పోయినట్లు సంతోషించాడు. ఒక నిముషం దగ్గడం మరిచిపోయాడుకూడా. అంతలోనే తను పడ్డ శ్రమ గుర్తు కొచ్చి 'హమ్మయ్య' అనుకుంటూ ఒక పెద్ద మర్రిచెట్టు నీడకింద కూలబడ్డాడు.

బడ్జెట్టు వస్తుందనేసరికి ధరలు పెరిగి పోయినట్లు సూర్యుడు క్షణ క్షణానికి పుట్టి పుణ్యానికి కోపం పెంచుకుని లోకం పైన నిప్పులు కురిపిస్తున్నాడు. మర్రిచెట్టునీడ నరసింహులు ప్రాణానికి హాయిగా ఉంది. లేవబుద్ధేయ లేదు. కాని, హాస్పిటల్ టైమ్ అయిపోతే తన కష్టం అంతా వృధా కదా? మందు తీసుకుని మళ్ళీ రాత్రికి ఇల్లు చేరవద్దూ?

నర్సింహులిది ఆ టౌనుకు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక పల్లెటూరు. అతని తండ్రి వడ్రంగి పని చేసేవాడు. అయితే, లోక ధర్మాన్ని అనుసరించి కొడుకును గుమాస్తా చదువు చదివించి కలెక్టరు చేయాలన్న ఆశతో కలలు గన్నాడు.

అయితే, ఏ జన్మ సంస్కారమో కానీ నర్సింహులికి తన కులవృత్తి అన్నా, తను పుట్టి పెరిగిన వూరన్నా చిన్నతనం నుంచి గొప్ప అభిమానం. ఆ మట్టి, ఆ గాలి, నీరు, మనుష్యులు ఏదన్నా అతనికి ప్రాణం. నిర్జీవమైన కొయ్య మొద్దుల నుంచి రకరకాలైన అందమైన వస్తువుల్ని తండ్రి తయారు చేస్తుంటే చూచి అతని తనువు పులకరించి పోయేది! అది విద్య కాదా?

వాళ్ళ వూరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న స్కూల్లో టెన్‌త్‌క్లాస్ దాకా చదివాడు. తీరిక వేళల్లో తండ్రికి వడ్రంగి పనిలో సాయం చేస్తూ ఆ పనే నేర్చుకున్నాడు.

టెన్‌త్ పాసయ్యాక కాలేజీ చదువుకు టౌనుకు వెళ్ళటానికి నిరాకరించాడు నరసింహులు. వూళ్లో ఉండి తండ్రి వృత్తికి వారసు డయ్యాడు.

"చదువుకుని ఏ ఆఫీసరువో అవుతే ఈ రెక్కల కష్టం తప్పేది కదురా. ఆనాడు నా మాట విన్నావు కాదు. పంకా కింది కుర్చీలో కూర్చుని, జీపుల్లో తిరుగుతూ చేసే ఉద్యోగానికి, రెక్కాడితే కాని డొక్కాడని మన వృత్తికి పోలి కెక్కడరా? నావూరు నావూరని నువ్వు మురిసి పోవలసిందే కానీ మన్నూ మశానం తప్ప ఇక్కడేముందిరా?" ఆ దిగులుతోనే తండ్రి చనిపోయాడు.

కానీ తను ఎంచుకున్న జీవన విధానం తక్కువదని నర్సింహులు ఎన్నడూ భావించలేదు. తన వృత్తిని గౌరవించాడు. కష్టపడటంలో గల సుఖాన్ని సంపూర్ణంగా అనుభవించాడు. ఆశల ఆరాటంతో పరుగు లెత్తకుండా లభ్యమైన ఆర్జనతో తృప్తి పడ్డాడు.

తల్లి అతనికి పెళ్ళి చేయాలని తాపత్రయ పడింది. అతనూ ఆ ప్రయత్నం లోనే ఉండగా ఆరోగ్యం చెడిపోయింది. వూహించని చిక్కుల్లో ఇరుక్కున్నాడు.

పాత ఇల్లు తప్ప పిత్రార్జితమైన ఆస్తేం లేదు అతనికి. పని చేస్తేనే కాని తిండి పుట్టదు. పనిచేస్తే అలుపు, ఆయాసం, దగ్గు.....

స్కూలు ఉన్న పక్క వూళ్ళో హెల్త్ సెంటర్ ఒకటి ఉంది. అయితే, ఆ సెంటర్‌లో డాక్టర్లెప్పుడూ ఉండరు. కుగ్రామమని, పై ఆదాయం ఉండదని ఉద్యోగం ఇచ్చినా ఏ డాక్టరూ ఆ వూళ్ళో జాయిన్ అవడు. జాయిన్ అయినా, మరునాడే శలవు పెట్టి టౌను కెళ్లి సొంత ప్రాక్టీసు చేసుకుంటూ కూర్చుంటాడు. హాస్పటల్‌లో ఉన్న ఒకటి రెండు రోజులు కూడా ఏ డాక్టరూ పేషెంట్లను చూడడు. చూచినా, ఇవ్వటానికి ఆ సెంటర్లో మందులేం ఉండవు. ఫలితంగా చావదల్చుకున్న వాడు తప్ప ఆ హెల్త్ సెంటర్‌కు ఎవడూ వెళ్ళడన్న పేరు పడిపోయింది.

కరక్కాయ వైద్యంతో కొంత కాలం నెట్టేశాడు నర్సింహులు. కానీ, పనిచేసే వోపిక రోజు రోజుకూ క్షీణించ సాగింది. అందుచేత ఆ హెల్త్ సెంటరుకు పోయాడు.

అప్పుడు ఆ హెల్త్ సెంటర్లో ఒక కాంపౌండర్ డాక్టరుగా వ్యవహరిస్తున్నాడు. అతను ఆ మందులూ, ఈ మందులూ ఇచ్చి నర్సింహుల్ని కొంత కాలం శాయశక్తులా బాధ పెట్టాడు. చివరికి అతని మీద దయ తల్చేడు. 'టౌను కెళ్ళి పెద్ద హాస్పటల్‌లో చూపించుకో. నీ రోగానికి కావలసిన మందులు ఈ సెంటరుకు సరఫరా చెయ్యరు' అని సలహా ఇచ్చాడు.

ఏదో పని మీద నర్సింహులు టౌనుకు రెండు మూడు సార్లు వెళ్ళినా, టౌను బాగా తెలియదు. హాస్పెటల్ ఎక్కడుందోకూడా తెలియదు.

''అసలు జబ్బేమిటి? ఆ హాస్పటల్‌లో ఏం చెప్పాలి?''

''అవన్నీ నీ కెందుకు? డాక్టర్లు చూచుకుంటారు. చెవి, గొంతు, ముక్కు డాక్టరును చూడు పో' అంటూ చిరాకు పడ్డాడు కాంపౌండరు డాక్టరు.

పని ముట్టు ముట్టుకుంటే అలుపొస్తూంది. రాత్రిళ్లుదగ్గు - నిద్ర పోనివ్వటంలేదు. ఇక నరిసింహు ఏం నెట్టేయగలడు? ఎలా నిర్లక్ష్యం చేయగలడు?

కాస్త డబ్బును సంతన చేసుకుని పట్నం బయలు దేరాడు. చచ్చీ చెడి హాస్పిటల్ చేరుకున్నాడు. చల్లటి నీడ తగిలేసరికి మనసు సింహావలోకనం చేసుకుందో క్షణం.

★——★——★

అలుపు కాస్త తీరిందనుకుని లేవబోతున్నాడు నర్సింహులు. నెత్తిమీద కాకి రెట్ట టపీమని పడింది.

'మర్రిచెట్టు నీడ కావాలనుకుంటే పక్షి రెట్టల్ని సహించక తప్పదుగా?' అని అనుకుంటూ కండువాతో కాకి రెట్టను తుడుచుకుని లేచాడు నర్సింహులు.

తిరుపతిలో దేవస్థానం వారి బస్సు డిపోలోలా హాస్పిటల్ అంతా క్యూల మయంగా ఉంది. రూము రూముకు క్యూతో హాస్పిటల్ కళకళ లాడుతోంది. క్యూలలో నిలుచున్న రోగుల మొహాల్లో ప్రపంచం లోని దరిద్రం, అనారోగ్యం అంతా నిండి ఉన్నట్లు ఉంది. అయినా వోపికచేసుకుని అనారోగ్యపు అరుపులు అరుచుకుంటున్నారు. 'నేను ముందంటే నేను ముందని' రోగవీరులు కొందరు కోట్లాటలకు దిగారు.

రోగాలు లేని వారికే రోగాలు తెప్పించే ఆ వాతావరణం చూడగానే నర్సింహులకి భయం వేసింది. పులి బోనులో ఇరుక్కుపోయిన మేకలా వణికిపోయాడు. దగ్గు ఉక్కిరి బిక్కిరి చేసింది. ఎవరినో అడిగి తెలుసుకుని ఒపీ టిక్కెట్లు ఇచ్చే క్యూలో నిలుచున్నాడు.

అదే పనిగా దగ్గుతున్న అతడిని చూచి క్యూలో వాళ్ళు పై గుడ్డలు ముక్కుకు అడ్డం పెట్టుకున్నారు. పుసి కట్టిన కళ్ళు రెండు అతడి వైపు అసహ్యంగా చూచాయి. "కాస్త నెమ్మదిగా దగ్గవయ్యా. మా నెత్తిమీదే దగ్గకపోతే గుడ్డ నోటికి అడ్డం పెట్టుకోరాదూ? చూడబోతే పల్లెటూరి గమ్మార్ లాగున్నావ్!" అన్నాడో పేంటు నాగరిక ప్రబుద్ధుడు - పేంటుకింద ఉన్నతీటను, తీట చేతితో బరబరా గోక్కుంటూ.

చీట్లు వ్రాసే ఆలస్యం కన్నా చీటీ చీటీకి పావలా వసూలు చేసుకోవటంలో ఆలస్య మవుతూంది. నర్సింహులు మెల్లగా ముందుకు సాగుతున్నాడు.

"చీటీ వ్రాసినందుకు పావలా చెల్లించాలా?" వెనక చేరిన రోగుల్లో ఒకరి నడిగాడు నెమ్మదిగా నర్సింహులు.

"ఎక్కడో పిచ్చోడిలాగున్నావే! ఇది గవర్నమెంటు హాస్పిటలయ్యా, బాబూ. మెట్లెక్కినందుకు డబ్బు, దిగినందుకు డబ్బు. క్యూలో నిలుచుంటే వోరేటు, నిలుచోకుండా ఉండాలంటే మరో రేటు. కిందకూర్చుంటే ఒకరేటు, బల్లమీద కూర్చోవాలంటే మరో రేటు. కుర్చీలో కూర్చోవాలనుకుంటే ఇంకోరేటు. డాక్టరు కళ్ళు మూసుకు చూస్తే ఫీజు, కళ్లు తెరుచుకుని పరధ్యానంగా చూస్తే ఫీజు. నీళ్లే ఉన్న ఇంజెక్షన్లకి, నీళ్ళు ఎక్కువ కలిపిన ఇంజెక్షన్లకీ, మందు ఎక్కువ ఉన్న ఇంజక్షన్లకీ మందే ఉన్న ఇంజక్షన్లకీ వేటి రేటు వాటిదే. మనుష్యుల్ని బతికిస్తే వోరేటు. చంపితే ఒకరేటు. చచ్చిన శవాలను అప్పగించటానికి మరో రేటు."

అతని ఉపన్యాసం ఇంకా అలా కొనసాగుతూనే ఉంది రేట్ల మీద. ఇంక చచ్చినా, ఎవరినీ ఏమీ ప్రశ్నించకూడదనుకున్నాడు నర్సింహులు. ఈ లోగా క్యూలో అతను ముందయ్యాడు. సరిగ్గా అప్పుడే టైమ్ అయిపోయిందని డిక్లేర్ చేశాడు, చీటీలు వ్రాసే అతను. నీరు కారిపోయాడు నర్సింహులు.

క్యూ నిముషంలో మాయమయింది. చీట్లు రాసే అతని చుట్టూ మూగారు జనం. అర్థ రూపాయి చెల్లించి చీటీ రాయించుకు పోతున్నారు.

''ఇది అన్యాయం. ఇంకా పది నిమిషాలైనా టైం ఉంది'' రేట్ల మనిషి అరుపును ఎవరూ పట్టించుకోలేదు.

నరిసింహులు దగ్గర డబ్బు కొద్దిగానే ఉంది. అందుకే డిపో నుంచి నడిచి వచ్చాడు. కానీ, చీటీ రాసినందుకు ఇక్కడ అర్ధ రూపాయి నష్టం. అయినా తప్పేదేముంది?

అర్ధరూపాయిచెల్లించి, పరమపద సోపాన పటంలో ఒ బుల్లి నిచ్చెన ఎక్కి 'ఇ యన్ టి' రూమ్ ముందున్న క్యూలో చేరిపోయాడు నర్సింహులు.

ఇ.యన్.టి రూము వాకిలికి అడ్డంగా వో నల్లటి ద్వారపాలకుడు చేతిలో సన్నటి కర్రపుల్ల పట్టుకుని నిలుచున్నాడు. మేకల మందల్ని అదిలించినట్లు క్యూలో జనం వరస తప్పితే అదిలిస్తున్నాడు. కర్రపుల్లతో బెదిరిస్తున్నాడు. అతనే మళ్ళీ క్యూలో నిలుచోని కొందరువ్యక్తుల్ని సగౌరవంగా లోపలికి పంపిస్తున్నాడు. క్యూలో వాళ్లకు యమభటుడు గానూ, క్యూలో నిలుచోని జనాన్ని లోపలికి పంపేటప్పుడు కుక్కపిల్లగానూ అతను ద్విపాత్రాభినయం చేస్తూ గేటు ముందు భాసిస్తున్నాడు. ఆ గేటు కతను డిక్టేటర్. అతను చెప్పిందీ, చేసిందీ రూలు! రూలంటే రూలే!

ఎవరో హాస్పిటల్ వాళ్ళు వచ్చి అతని చెవిలో ఏదో గొణిగితే, నర్సింహులు వెనుక నున్న చాలా మందిని అతను క్యూలో ముందుకు నెట్టి లోపలికి పంపించాడు. నర్సింహులు అదృష్టం పండి అతడినీ పిలిచాడు. లోపలికి పంపించాడు. తను పంపించాల్సిన వ్యక్తి నర్సింహులు వెనుకనున్న వ్యక్తి అని తెల్సుకొనేసరికి నర్సింహులు డాక్టరుకు చీటీ ఇచ్చేశాడు. నర్సింహులు కావాలని తనను మోసంచేసినట్లు కోపం వచ్చింది అతనికి!

నర్సింహులు ఇచ్చిన చీటీని పెద్ద డాక్టరు తీసుకున్నాడు. నర్సింహులు వైపు చూడనన్నా లేదు. నర్సింహులే తన బాధంతా చెప్పుకున్నాడు. అతని కథ ఇంకా సగంలోనే ఉంది. పెద్ద డాక్టరు చీటీ మీద ఏమో బరికాడు. రెండు చిన్న కాగితం ముక్కల మీద ఏమో వ్రాసి నర్సింహులు ముందుకు విసిరేశాడు.

''గోలీలు, ఇంజక్షను ఇస్తారు. పది రోజులు తీసుకో పో, నెక్స్ట్''

నర్సింహులు ఏదో చెప్పాలని నిలుచున్నాడు. ద్వారపాలకుడు అతడి చెయ్యి బట్టి లాగాడు.

'నీ కథంతా డాక్టరుగారికి చెప్పుకోవాలంటే పాతిక రూపాయలు తీసుకుని ఇంటికి పో. ఇక్కడ ఎన్ని కథలని వింటారు? క్యూలో ముందు నిన్ను పంపినందుకు ముందు నాకు రెండు రూపాయలు ఇవ్వు''.

''నాదగ్గర లేదు''. చీటీలు తీసుకుని వెళ్ళిపోయాడు నర్సింహులు.

గోలీల క్యూలో కొంతసేపు నిలబడి నాలుగు తెల్ల మాత్రలు సంపాదించుకుని మరో వైపునున్న ఇంజక్షన్ క్యూను చేరాడు. అడవాళ్ళకు, మగవాళ్ళకు క్యూలు ప్రత్యేకం.

ఆడవాళ్ళ క్యూలో ఒక తల్లి చేతులో బిడ్డ, నర్స్ చేతిలో సిరెంజి చూచి ఏడుస్తూంది. నర్స్ మొహం ధుమధుమ లాడుతూ తుమ్మల్లో పొద్దు గుంకినట్లుంది. ''సైలెన్స్...పిల్లల్ని ఏడిపిస్తే

ఇంజెక్షన్ ఇవ్వను'' అంటూ నర్స్ అరిచింది. ఏడుస్తున్న పాప వైపు సిరెంజిని తుపాకిలా గురి పెడుతూ వచ్చి మొరటుగా ఆ పిల్ల రెట్టమీద కసుక్కున పొడిచింది.

ఇన్‌జెక్షన్ పొడిపించుకుని బయట పడ్డాడు నర్సింహులు. హాస్పిటల్ కన్నా ఖణఖణ లాడే ఎండే చల్లగా వున్నట్లనిపించిందతనికి.

★——★——★

నాలుగు రోజుల అనుభవంతో హాస్పిటల్ పద్ధతులు నర్సింహులికి పూర్తిగా తెలిసి పోయాయి. తన జబ్బేమిటో తెలుసుకున్నాడు. వూపిరి తిత్తుల జబ్బుకు, గొంతు——ముక్కు స్పెషలిస్టు మందులిస్తున్నాడు. కడుపు మండింది. కానీ, ఆవేశ పడితే అసలికే మోసం!

డబ్బున్న వాళ్ళకు రోగం వస్తే వాళ్లకు రోగం బాధ ఒక్కటే. దాన్ని డబ్బు లంచ మిచ్చి మచ్చిక చేసుకోవచ్చు.

కానీ, పేద వాడికి రోగంవస్తే రోగం బాధ కన్నా పేదరికపు బాధ జాస్తవుతుంది. ఆరోగ్యం లేకపోతే పని ఉండదు. పని లేకపోతే డబ్బుండదు. డబ్బుండకపోతే మందు లుండవు. మందులు వెయ్యకపోతే రోగం నయం కాదు. అదో విష చక్రం. యిరుక్కున్నాక నెమ్మదిగా బయట పడే మార్గం చూచుకోవాలి కాని, ఆవేశ పడితే కోరలు కొరికేస్తాయి.

ద్వారపాలకుడికి రెండు రూపాయలు లంచం ఇచ్చి చీటీని చిన్నగా ఇ యన్ టి నుంచి జనరల్ మెడిసిన్‌కు మార్పించుకున్నాడు. అదృష్టం బాగుండి అతని చీటీవో హవుస్ సర్జన్ చేతిలో పడింది.

ఆ హవుస్ సర్జన్ వస్తుతః కాస్త వూహాజీవి. ఆదర్శాల పుట్ట. వృత్తిలో కిటుకులు తెలుసుకున్నా ఆచరణలో మానవత్వాన్ని పూర్తిగా వదులుకోనివాడు. గుండెను, ఊపిరితిత్తుల్ని స్టెతస్కోప్‌తో పరీక్షించి వులిక్కి పడ్డాడు. చీటీ చూచి మొహాన్ని విసుగ్గా ముడిచాడు.

''నీ కేసు ఇ యన్ టికి పంపించిందెవరయ్యా? ఇ యన్ టి లో ఏం పరీక్ష చేశారు? నీ రెండు లంగ్స్ చెడిపోయాయయ్యా, బాబూ! ఎంత ప్రమాదకరమైన కేసు? హాస్పిటల్‌లో అడ్మిట్ అవుతేనే కానీ లాభం ఉండదు. జాయన్ అవుతావా?''

ఆ కుర్ర డాక్టరు భగవంతుడి అవతారంగా కనిపించాడు నర్సింహులుకు. భక్తితో రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఉంటానని తలూపాడు.

''అలా కూర్చో కాసేపు. పెద్ద డాక్టర్‌గారు వార్డుకు వెళ్ళారు——రాగానే నీ కేసు చెబుతాను.''

పెద్ద డాక్టరుగారు రానే వచ్చారు. ఆయనతో కుర్ర డాక్టరు ఏదో చెప్పాడు. నర్సింహులు చీటీ చూపించాడు. అతనిని చూపించాడు. పెద్ద డాక్టరు మొహం చిరాకుగా పెట్టాడు. ఇంగ్లీషులో కుర్ర డాక్టర్ని ఏదో చీవాట్లు వేశాడు. నర్సింహుల్ని పిలిచి పరీక్ష చేసినట్లు నటించాడు.

''ఏం లేదు. భయపడకు. పది రోజులు ఈ గోలీలు, ఇన్‌జెక్షన్ తీసుకో. తగ్గిపోతుంది'' అని చెప్పి పంపించాడు.

తీరా చూస్తే గొంతు——ముక్కు డాక్టరిచ్చిన గోలీలు, ఇంజక్షనే ఈయనా రాసిచ్చాడు.

పరమపదసోపాన పటంలో పెద్ద పాము చేత మింగబడి మళ్ళీ మొదటి కొచ్చాడు నరసింహులు.

★——★——★

జబ్బు ఏమిటో తెలియ నన్నాళ్ళు జబ్బేమిటోనన్న బాధ, భయం, సర్వులకీ సహజమే. అయితే, ధనవంతుడు జబ్బును పట్టుకున్నాక ఎంత ఖర్చైనా పెట్టి దాన్ని చంపేసిందికా నిద్ర పోడు. కానీ పేద వాడికి ఆ ఆయుధం లేదు. అందుచేత జబ్బును తలుచుకుని భయపడుతుంటాడు. మృత్యువు అలాటి వాళ్ళను తియ్య తియ్యగా చప్పరించుకుంటూ, మెల్లగా తింటుంది. ఎప్పుడో ఉన్నట్లుండి గుటుక్కున మింగేస్తుంది.

నర్సింహులుకు కుర్ర. డాక్టరు భగవంతుడు. అతని మాటల్ని నమ్మాడు. కానీ, ఆ మరునాడు కుర్ర డాక్టరు ఆ డిపార్టుమెంటులో కనిపించ లేదు. రెండోనాడు వాకిట్లో ఎదురు పడి ఆగి మరీ నర్సింహుల్ని విచారించాడు. సలహా ఇచ్చిపోయాడు కూడా.

''నీకు మేలు చేయబోయి నేను కీడు తెచ్చుకున్నా. నువ్వేం చేస్తావ్‌లే! కాలం అలాగుంది. నాకు కీడు జరిగినందుకు విచారం లేదు. కానీ, నీకు మేలు జరగలేదనే నా బాధ. ఆ గోలీలతో, ఇన్‌జెక్షన్లతో తగ్గే రోగం కాదు నీది. పెద్ద డాక్టరుగారు అలాంటి రోగాలు నయం చేయటంలో పెట్టింది పేరు. ఆయన్ని ఎలాగైనా ప్రసన్నం చేసుకుని హాస్పిటల్‌లో జాయిన్ అయిపో. లేకపోతే ప్రమాదం సుమా.''

పెద్ద డాక్టర్ని ప్రసన్నం చేసుకోవటానికి ఒకే ఒక్క మార్గం ఉంది. అదేమిటో నర్సింహులికి తెలుసు. కానీ, అంత శక్తి లేదతనికి.

ఆ రోజు కాళ్ళు పట్టుకుని తన బాధ చెప్పుకొందామని నిర్ణయించుకున్నాడు నర్సింహులు. అదే మనసులో అనుకుంటూ క్యూలో నిలుచున్నాడు. ఇక ఇద్దరు రోగుల్ని చూస్తే తన వంతు వస్తుంది.

సరిగ్గా ఆ సమయంలో క్యూ పక్కకు సర్దుకొంది.

ఇద్దరు జైలు భటులు అటూ ఇటూ అనుసరించగా దర్జాగా ఒక వ్యక్తి డాక్టరు దగ్గరికి నేరుగా వచ్చాడు.

ఆ వ్యక్తి ఖైదీ అని తెలుసుకున్నాడు నర్సింహులు. ఖైదీలకు హాస్పిటల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యం చేస్తారని, సర్వ సదుపాయాలు కల్పిస్తారని కూడా తెల్సుకోగలిగాడు.

''మీ లంగ్ కాస్త దెబ్బతింది. హాస్పిటల్‌లో అడ్మిట్ కాకూడదూ ?''

తనని అడుగుతున్నట్లే భ్రమపడ్డాడు నర్సింహులు. 'అలాగే చేరుతాను, సార్' అని

అని నవ్వుల పాలయ్యాడు. ఆ తర్వాత అతనే డాక్టర్ని అభ్యర్థించి, లేదనిపించుకోవటమే కాక చీవాట్లు కూడా తిన్నాడు.

ఖైదీల కున్న కొన్ని సౌకర్యాలు మామూలు మనుష్యులకి లేనట్లుంది ఈ లోకంలో. మరి ఆ సౌకర్యాలు కావాలనుకొన్న మనుష్యులు ఖైదీలవుతే పోలే?

హాస్పిటల్ నుంచి బయటికి వచ్చిన నర్సింహుల్ని ఆ ఆలోచన వెంటాడింది.

★——★——★

దొంగతనాలు, హత్యలు చేసి జైలుకొచ్చే ఖైదీలకన్నా, అలాంటి పనుల్నే రాజకీయాల పేరిటో, విప్లవం పేరిటో, దేశభక్తి పేరిటో చేసి జైల్లోకొచ్చే ఖైదీలకు విలువ జాస్తని నర్సింహులు తెల్సుకొన్నాడు. అతని అదృష్టం బాగుండి ఆ వూళ్ళో అప్పుడేదో రాజకీయ సత్యాగ్రహం జరుగుతోంది. అలజడిగా ఉంది. దానిలో జొరబడి పోలీసుల మీద రాళ్ళు రువ్వి, బస్సుల అద్దాలు పగులగొట్టి పోలీసులకు పట్టుబడి, జైలు శిక్ష విధించబడి జైలు ఖైదీ అయ్యాడు. నిర్బంధంలో ఉండగా పోలీసులు తనని చిత్రహింసల పాలు చేశారని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అతనికి ప్రచారం వచ్చింది.

జైలు అధికారులు అతని పట్ల అత్యంత శ్రద్ధ వహించారు. నడవలేనంటే వాన్‌లో అతనిని హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. పెద్ద డాక్టరు అతడిని ప్రత్యేకంగా పరీక్షలు చేశాడు. రక్త పరీక్షలు ... ఎక్స్‌రే పరీక్షలు క్షణాల మీద జరిగిపోయాయి. అతని లంగ్స్ రెండూ బాగా దెబ్బతిన్నాయనీ, అవుతే అవి చాలా రోజుల క్రితమే దెబ్బ తిన్నాయని ప్రకటించాడు. డాక్టరు ప్రకటన తప్పనీ, పోలీసుల దెబ్బల వల్లే తన లంగ్స్ దెబ్బతిన్నాయని ప్రకటించాడు నర్సింహులు. రాజకీయ శక్తులు ప్రభుత్వాన్ని అన్ పాపులర్ చేయటానికి మంచి అవకాశంగా దీన్ని భావించారు. ఎంక్వయిరీ జరపాలని పట్టుబట్టారు.

ఈలోగా నర్సింహుల్ని హాస్పిటల్‌లో స్పెషల్‌గా ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. మహారాజా వైభవంగా ఉందతని పని.

హాస్పిటల్‌కి వస్తూ పోతూ ఇప్పుడు అతను క్యూలో నిల్చున్న అభాగ్యులను చూచి, వాళ్ళ అజ్ఞానానికి మనసులో నవ్వుకొంటున్నాడు.

"మిస్టర్ నర్సింహం! మీ శిక్షకాలం పూర్తి అయింది. మిమ్మల్ని రేపు జైలు నుంచి విడుదల చేస్తున్నాం."

అతనికి ఆ వార్త భయాన్ని కలుగజేసింది. మరి తన జబ్బు?

"మీ జబ్బు తగ్గుమొహం పడుతోంది. రోజూ హాస్పిటల్‌కి వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకోండి."

అవును. తీసుకోవాలి. మళ్ళీ క్యూలు ... మళ్ళీ పదిపైసల ఖరీదు చేసే గోలీలు. నీళ్ళ ఇంజెక్షను. ద్వారపాలకుల బెదిరింపులు ... డాక్టర్ల చిరాకులు...

"నో. నేను జైలునుంచి పోను. అవసరమైతే జైల్లోనే ఏదన్నా నేరం చేసి మళ్ళీ జైల్లోనే ఉండిపోతా. నాజబ్బు నయం కావాలంటే ఇంతకన్నా మార్గం లేదు."

నర్సింహులు ఉన్నట్లుండి అరిచాడు. బస్సులో జనం వెర్రివాడిని చూచినట్లు చూచా

రతడిని!

'ఎంత దుర్మార్గపు ఆలోచన!' సిగ్గుపడ్డాడు. తనపైన తనకే అసహ్యం వేసింది నర్సింహులుకు.

ప్రభుత్వ హాస్పిటళ్ళు మురికి కూపాలుగా, అవినీతి నిలయాలుగా మారి ఉండవచ్చు. మానవత్వానికి మత్తు మందిచ్చి అనుక్షణం ఆపరేషన్ చేస్తుండవచ్చు. అందుకని రోగులంతా నేరాలు చేసి ఖైదీలుగా మారటం ధర్మమా? ఎలుక లున్నాయని ఇల్లుచిచ్చుపెట్టుకోటం మూర్ఖత్వం కాదూ?

తిండికోసం, మందుకోసం, సుఖంకోసం, చేజేతులా శృంఖలాలు తగిలించుకునే వ్యక్తులు——రేపు అంతకన్నా ముఖ్య అవసరాలు తీర్చుకోటం కోసం ఆశా వ్యామోహాల్లో ఇరుక్కుని దేశాన్ని ఇతరులకు కుదువబెట్ట రన్న నమ్మకం ఏమిటి?

వద్దు ... ఆ సంకెళ్ళు తనకొద్దు!

శృంఖలాబద్ధంగా బంగారు పంజరంలో భోగభాగ్యాలు అనుభవించే కన్నా స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ మాతృభూమిలో మరణించటమే తనకిష్టం.

కానీ, ఈ కాలుష్యాన్ని కడిగేసే మార్గమే లేదా?

బంగారు సంకెళ్ళు —— స్వేచ్ఛా మరణం ... ఈ రెండూ తప్ప మూడో మార్గం లేదా!

గతుకుల రోడ్డులో కుదుపులతో పోతున్న బస్సు ఒక పెద్ద గుంటలో ఇరుక్కుని కాస్సేపు మరణ వేదన పడుతున్నట్లు రొదపెట్టి మూగబోయింది. ప్రయాణీకులు బలబిలా బస్సుదిగి బస్సును గుంటలోనుంచి ఉద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అవినీతి బురదలో ఇరుక్కున్న దేశాన్ని ఉద్ధరించటానికి అలాగే ప్రజలంతా ఏకమై ఉత్సాహంతో నడుంకట్టి పోరాడే కాలం ఎప్పుడొస్తుందో?

గుంటలోనుంచి బయటబడి బస్సు ఆనందంతో అరిచి ప్రయాణానికి సిద్ధమవుతోంది. కానీ బస్సులోనే కుర్చుని ఉన్న నర్సింహులు ప్రయాణం అక్కడితో ఆగిపోయింది! సమస్యల సంకెళ్ళను తెంచుకొని హాస్పిటళ్ళతో, డాక్టర్లతో అవసరం లేని చోటికి పారిపోయా డతను!

ఆంధ్రప్రభ వారపత్రిక — 1981